



RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక




నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 23 ఆగస్టు 2026 | సంపుటి :16 సంచిక :134 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



### నితిన్ నబీన్ అధ్యక్షతన నూతన

## జాతీయ కార్యవర్గం తొలి సమావేశం ప్రారంభం..

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన నూతన జాతీయ కార్యవర్గం తొలి సమావేశం ప్రారంభమైంది. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సంస్థాగత నిర్మాణం, పార్టీ విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై నూతన కార్యవర్గం చర్చించనుంది. ఈ సమావేశానికి ముందు వందేమాతరం గీతంలోని ఆరు చరణాలనూ నేతలంతా ఆలపించారు. అనంతరం రాబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై చర్చ ప్రారంభమైంది.ప్రజా జీవితంలో ప్రధాని మోదీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ కార్యాచరణపైనా చర్చ జరగనుంది.

2




### ఢిల్లీలో మళ్లీ నిరసన సెగ..

## ఈ సారి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా..

దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ నిరసన చెలరేగింది. ఇటీవలే విద్యావ్యవస్థలోని అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలతో దేశం అట్టుడికిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు నిరసనకారులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కదం తొక్కారు. జంతర్ మంతర్‌లో 'రిజర్వేషన్ హఠావో' పేరుతో ఆందోళనలు చేపట్టారు. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది నిరసనకారులు ఇందులో పాల్గొన్నారు.

2



### యోగి, అఖిలేష్ సహా

## 52 మందికి బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు..

ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ నాయకుల భద్రతను ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతితో సహా మొత్తం 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు అందించినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. 2027 యూపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగానే ఈ చర్య చేపట్టినట్లు తెలిపింది.

## లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్

# ప్రతినిధుల భేటీ

### అక్టోబర్‌లో లివర్‌పూల్ ప్రతినిధుల బృందం

### భాగస్వామ్యంపై అధికారిక ఒప్పందానికి సన్నాహాలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. లండన్‌లో పలువురు ప్రతినిధులతో సీఎం భేటీ అవుతున్నారు. ఈ మేరకు తెలంగాణ అభివృద్ధిపై చర్చిస్తున్నారు. ఈరోజు (శనివారం) లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్, ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధులు చర్చించారు.

2 లో..





### తెలంగాణ అభివృద్ధికి

## అడ్డంకులు సృష్టిస్తోంది..

2



తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.




2

## విద్యుత్ రంగంలో సరికొత్త టెక్నాలజీ.. నెక్లెస్ రోడ్‌లో పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

### సహజ న్యాయసూత్రం ప్రకారం

## ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదు



2

కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని బీసీలను ఒకలా, రెడ్డిలను మరోలా చూడట్లేదని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. ఈ రోజు(శనివారం) ఏబీఎన్‌తో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. కొండా సుస్మిత వ్యవహారంపై అధిష్ఠానం స్పందించిందని, ఈ మేరకు మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు.



### గచ్చిబౌలిలో కుప్పకూలిన

## ఏడంతస్తుల భవనం.. ఇద్దరి మృతి

2

హైదరాబాద్‌లోని మాదాపూర్ సర్కిల్ పరిధి గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఈరోజు (శనివారం) ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. కేవలం 50 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా పక్కకు వాలి సమీపంలోని వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కుప్పకూలింది.

# లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్ ప్రతినిధుల భేటీ

## నితిన్ నబీన్ అధ్యక్షతన నూతన జాతీయ కార్యవర్గం తొలి సమావేశం ప్రారంభం..

ఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన నూతన జాతీయ కార్యవర్గం తొలి సమావేశం ప్రారంభమైంది. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సంస్థాగత నిర్మాణం, పార్టీ విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై నూతన కార్యవర్గం చర్చించనుంది. ఈ సమావేశానికి ముందు వందేమాతరం గీతంలోని ఆరు చరణాలనూ నేతలంతా ఆలపించారు. అనంతరం రాబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై చర్చ ప్రారంభమైంది. ప్రజా జీవితంలో ప్రధాని మోదీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ కార్యాచరణపైనా చర్చ జరగనుంది. అక్టోబర్ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలం వరకు సాగిన ప్రయాణాన్ని ప్రజలకు వివరించడంపై చర్చించనున్నారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. కాగా, బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డి, డీకే అరుణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.మరోవైపు, నితిన్ నబీన్ కొత్త టీమ్‌లో అనుభవం, యువ నాయకత్వం, ప్రాంతీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా ప్రాతినిధ్యం కల్పించారు. దీంతో స్మృతి ఇరానీ, రామ్ మాధవ్, బిప్లబ్ దేవ్, సునీల్ బన్సల్ తదితరులకు కీలక బాధ్యతలు దక్కాయి.

## ఢిల్లీలో మళ్లీ నిరసన సెగ.. ఈ సారి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా..

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ నిరసన చెలరేగింది. ఇటీవలే విద్యావ్యవస్థలోని అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలతో దేశం అట్టుడికిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు నిరసనకారులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కదం తొక్కారు. జంతర్ మంతర్‌లో 'రిజర్వేషన్ హఠావో' పేరుతో ఆందోళనలు చేపట్టారు. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది నిరసనకారులు ఇందులో పాల్గొన్నారు. వీరిలో పలువురు రిజర్వేషన్లను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేయగా, కొందరు ఆర్థిక అసమానతల ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించాలన్నారు. సుమారు 5.4 మిలియన్ల ఫాలోవర్లున్న ఓ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం కొనసాగింది. ఆగస్టు 21 తేదీన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గళం విప్పాలని ఆ పేజీ ఇదివరకే పోస్ట్ పెట్టింది.జంతర్ మంతర్‌లో ఆందోళనల నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. రిజర్వేషన్ హఠావో ఆందోళన్ కార్యక్రమాన్ని సాయంత్రం 4 గంటల వరకు రామ్‌లీలా మైదానంలో నిర్వహించుకునేందుకు తొలుత అనుమతిచ్చారు. కానీ ఒకరోజు ముందు నిరసన వేదికను మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎక్కడికీ వెళ్లేది లేదని, తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు జంతర్ మంతర్‌లోనే శాంతియుతంగా ఆందోళన చేపడతామని నిరసనకు నాయకత్వం వహిస్తున్న అభిషేక్ అగ్నిహోత్రి చెప్పారు.

### రిజర్వేషన్ చట్టాలను బలవంతంగా రుద్దుతున్నారు..

బిహార్ నుంచి ఆందోళనలో పాల్గొన్న ప్రత్యూష్ గౌర్ అనే వ్యక్తి రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించారు. వాటిని బలవంతంగా ప్రజలపై రుద్దుతున్నారన్నారు. దీనివల్ల ఎక్కువ మార్కులు సాధించిన జనరల్ కేటగిరీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందారు. ప్రభుత్వాలు నిరసనల తరువాతే ప్రజలు డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం సరికాదన్నారు. పాలకులు ప్రజా సమస్యలపై కాకుండా మతాలు, కులాలపై శ్రద్ధ పెడుతున్నారని వ్యాఖ్యానించారు.

## యోగి, అఖిలేష్ సహా 52 మందికి బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు.. యూపీ ఎన్నికలకు ముందు కీలక భద్రతా చర్యలు..

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ నాయకుల భద్రతను ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతితో సహా మొత్తం 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు అందించినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. 2027 యూపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగానే ఈ చర్య చేపట్టినట్లు తెలిపింది. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు అందుకున్న వారిలో యోగి ఆదిత్యనాథ్, అఖిలేష్ యాదవ్, మాయావతితో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నారు. మొత్తం 11 మంది రాష్ట్ర మంత్రులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. భద్రతా అవసరాల సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లను రెండు దశల్లో అందించినట్లు తెలుస్తోంది. మొదటి దశలో 8 మంది నేతలకు, రెండో దశలో మరో 44 మందికి జాకెట్లు ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ ఒక్కో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ విలువ రూ.10 లక్షలని సమాచారం . 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో భారీ బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు వంటి కార్యక్రమాల్లో ప్రముఖ నేతలు పెద్ద సంఖ్యలో ప్రజలను కలుసుకోనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల భద్రతపై యూపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అయితే 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ఇవ్వడానికి ఏదైనా నిర్దిష్ట దాడి ముప్పు లేదా ప్రత్యేక నిఘా సమాచారం కారణమా అన్నది అధికారికంగా వెల్లడించలేదు.

## సహజ న్యాయసూత్రం ప్రకారం ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదు: మల్లు రవి

హైదరాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని బీసీలను ఒకలా, రెడ్డిలను మరోలా చూడట్లేదని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. ఈ రోజు(శనివారం) ఏబీఎన్‌తో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. కొండా సుస్మిత వ్యవహారంపై అధిష్ఠానం స్పందించిందని, ఈ మేరకు మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. దీనిపై మంత్రి సురేఖ వాట్సాప్‌లో వివరణ లేఖను పంపినట్టు తెలిపారు. అయితే.. ఈ లేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని చెప్పారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని పేర్కొన్న కొండా సురేఖ వివరణను మల్లు రవి వ్యతిరేకించారు. 'పార్టీకి వ్యతిరేకంగా ఒకరు మాట్లాడుతుంటే దేవదాయశాఖ మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ ఎందుకు స్పందించలేదు? పార్టీ సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఖండించాల్సింది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నారు?' అని ప్రశ్నించారు. కాగా.. గతంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.అలాగే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన అంశంపై కూడా మల్లు రవి స్పందించారు.

### అక్టోబర్‌లో లివర్‌పూల్ ప్రతినిధుల బృందం

### భాగస్వామ్యంపై అధికారిక ఒప్పందానికి సన్నాహాలు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. లండన్‌లో పలువురు ప్రతినిధులతో సీఎం భేటీ అవుతున్నారు. ఈ మేరకు తెలంగాణ అభివృద్ధిపై చర్చిస్తున్నారు. ఈరోజు (శనివారం) లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్, ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధులు చర్చించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి లివర్‌పూల్ ప్రతినిధులు ఆసక్తి చూపిస్తున్నారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, క్రియేటివ్ ఎకానమీపై భాగస్వామ్యం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు లివర్‌పూల్ ప్రతినిధుల బృందం అక్టోబర్‌లో రానుంది. హైదరాబాద్ పర్యటనలో లివర్‌పూల్ భాగస్వామ్యంపై అధికారిక ఒప్పందానికి సన్నాహాలు చేస్తున్నారు.

### లండన్ ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు: సీఎం సలహాదారు రామకృష్ణారావు

లండన్ ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు జరిగాయని సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు తెలిపారు. ఇంపీరియల్ కాలేజీని సందర్శించామని అన్నారు. ఆ కాలేజీ ప్రతినిధులతో విద్యా సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించామని వెల్లడించారు. తెలంగాణలో షార్ట్‌టర్మ్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులపై పరిశీలిస్తున్నామని అన్నారు. పరిశోధన, విద్యార్థులు - అధ్యాపకుల మార్పిడిపై ఇంపీరియల్ ఆసక్తి చూపిస్తోందని వివరించారు.ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఇంపీరియల్ ప్రతినిధులకు ఆహ్వానించామని రామకృష్ణారావు చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జరుగుతుందని తెలిపారు. రాజువీ, బిజినెస్ విద్యలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థగా ఇంపీరియల్ కాలేజ్‌కి పేరొందని వెల్లడించారు. అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తెలంగాణ అభివృద్ధికి భాగస్వామ్య చర్చలు జరిగాయని వివరించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కార్యక్రమాలకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నట్లు రామకృష్ణారావు పేర్కొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తోంది.. కేంద్రంపై మంత్రి పొన్నం ఫైర్..

సిద్దిపేట: న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్-2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు.రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'పల్లె పల్లెకు పొన్నం అన్న- పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

## విద్యుత్ రంగంలో సరికొత్త టెక్నాలజీ.. నెక్లెస్ రోడ్‌లో పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

హైదరాబాద్,

నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజాలో పవర్ ఎగ్జిబిషన్--2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతలను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది.ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్




వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరి మృతి

హైదరాబాద్,

హైదరాబాద్‌లోని మాదాపూర్ సర్కిల్ పరిధి గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఈరోజు (శనివారం) ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. కేవలం 50 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా పక్కకు వాలి సమీపంలోని వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. మృతిచెందిన వారిని మధ్యప్రదేశ్‌కు చెందిన మహబత్, ఉమేశ్‌గా గుర్తించారు.ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్‌ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.అక్రమంగా ఈ బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాలను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది.

### రెండు మృతదేహాలను గుర్తించాం: సుధాకర్ రావు

ఈ ప్రమాదంపై రీజనల్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ రావు మాట్లాడారు. భవనం కుప్పకూలిందనే సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలికి చేరుకున్నామని తెలిపారు. విక్టిమ్ లోకేషన్స్ సిస్టం ద్వారా శిథిలాల కింద రెండు మృతదేహాలు ఉన్నట్లుగా గుర్తించామని అన్నారు. ఆ మృతదేహాలను వెలికి తీసి పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఇంకా శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా..? అని తనిఖీలు చేస్తున్నామని అన్నారు. ఉదయం భవనంలో పనిచేయడానికి ఇద్దరు వచ్చినట్లుగా స్థానికులు చెప్పారని సుధాకర్ రావు పేర్కొన్నారు.

## ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్.. ఇద్దరు మృతి

యాదాద్రి భువనగిరి:

భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెంలో హేజోలో ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో మరో 12 మందికి గాయాలయ్యాయి. పేలుడు కారణంగా మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతోన్నాయి. పొగ దట్టంగా అలముకుంది. మూడు నెలల వ్యవధిలో కంపెనీలో రియాక్టర్ రెండోసారి పేలింది. కంపెనీ నుంచి విష రసాయనాలు వెలుబడుతోన్నాయి. ఘాటైన వాసన వెదజల్లడంతో సమీప గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దోతిగూడెం, అంతమ్మగూడెం వరకు రసాయనాల ఘాటు వ్యాపించింది ఫైర్ ఇంజన్‌తో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నా కూడా రసాయనాలు లీక్ అవుతుండటంతో పెద్ద ఎత్తున వ్యాపిస్తోన్నాయి.



న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# భయం హద్దు దాటి భయపెడితే!

జంతర్ మంతర్ విద్యార్థుల అందోళన ఎందుకో కదలని నిలువ నీటిలో ఒక రాయి విసిరినట్లు, ఎడారులైన మన యోచనలలోనుండి ఒక పచ్చటి మొలకవలే, ఒక నమ్మకం తలెత్తి కొత్తగా చిగురించినట్లు, ఇక ముగిసిందని మనం కప్పుకున్న నిరాశల దుప్పటిని కొంచెం లాగి సన్నటి వెలుగు రేఖల వైపు వేలు చూపించినట్లు ఎందుకు అనిపిస్తుందో కానీ అట్లా అనిపిస్తున్నది చాలా మందికి. ఆ జంకుగొంకు లేని జన్ జీ విద్యార్థులలోని ఒక నాయకురాలు నేహా బోరా. జెఎన్‌యులో రీసెర్చ్ స్కాలర్, ఐసా (ఎఐఎస్ఎ) అనే ఒక విద్యార్థి సంస్థకి జాతీయ అధ్యక్షురాలు. ఆమె ముఖంలో తీక్షణత, స్వరంలో తీవ్రత, సీరియస్ విషయాలను సైతం సులభంగా, అర్థం అయ్యేలా, లాజికల్‌గా మాట్లాడటం, కొంచం హాస్యం, హాయైన నవ్వు, వృద్ధులవుతున్న వాళ్లలో వాళ్ల యవ్వన కాలపు తిరుగుబాట్ల ఉత్సాహభరిత దినాలను, కొంచెం ఆశను, యువతీ, యువకుల్లో సరికొత్త స్ఫూర్తిని, ఆలోచనలను కలిగించిన మాట వాస్తవమే. ౹ాశ్రీంశీ =ముఃం – హర్మ్యాజ్‌పై అమెరికా కన్ను౹ాఃజవతీఱంవఎవత్ ఆ వయసు పిల్లల్లో చాలామంది కన్నా నేహా బోరా ఆలోచనలలో చాలా లోతైనవి. చాలా స్పష్టత కూడా ఉంది. బహిరంగ ఉపన్యాసాలలోనూ, ఇంటర్వ్యూల లోనూ లాజికల్ గా, పరిణతితో ఆమె మాట్లాడుతూ ఉంది. తక్షణ, పాక్షిక విజయాలకి ఉబ్బితబ్బిబ్బు అయిపోవడం కాకుండా, రేపు ఏమి జరగనున్నదో కూడా, ఎంత పెద్ద ఉద్యమాలు చేయాలో, ఎటువంటి నిర్బంధాలు వస్తాయో కూడా నేహా బోరాకి తెలుసు అనుకుంటాను. ఇవాళ ఆ అమ్మాయి, అలా ఉండడం అన్నది ఏదో ఒక్క రోజుతో వచ్చింది కాదు. అదిఆమె నమ్ముతున్న విశ్వాసాలు, ఉన్న నిర్మాణాలు, అధ్యయనం ఆమెకు కలిగించిన స్పష్టత అన్నది కూడా ఎవరూ మర్చిపోకూడదు. నవ యువతీ యువకులకు, కౌమార్యపు పిల్లలకు సామాజిక చైతన్యం బొత్తిగా లేకుండా పోయింది, జీవితాన్ని అనుభవించడం తప్ప, వీళ్ళకి అసలు ఏ విషయలూ పట్టవు, సీరియస్‌గా ఆలోచించే తరం కాదు ఇది అంటూ పెద్దవాళ్ల, సీరియస్ ముఖాలు గల సామాజిక చైతన్యవంతుల విమర్శలను ఎదుర్కొంటూ ఉండే వీళ్ళు, నాణానికి గల మరో ముఖం సమాజానికి చూపారు. నిజానికి నిర్మాణాత్మకంగా పనిచేస్తూ వున్న అనేక సంస్థలు, వాటి ఆలోచనలు, పని పద్ధతులు ఎంతో కాలంగా ఒక మూసలోకి వెళ్ళిపోయి, నేను, నా నిర్మాణం తప్ప మిగిలినవన్నీ తప్పు, మేం మాత్రమే కరెక్ట్ అన్న ధోరణిలోకి, మామూలు జనానికి అర్థం కాని ఊకదంపుడు మాటలలోకి, ఏ మాత్రం సృజనాత్మకత లేని మోనాటనస్ నిరసన రూపాలలోకి వెళ్లి చాలా కాలం గడిచింది. వదిలించుకో లేనంతగా, స్వీయ పరిశీలన లేకుండా ఇలాంటి వాటిలో మునిగితేలుతూ వుండటం వల్లనేమో, 'చోదక శక్తులు' అనబడే వాళ్ళు కూడా ఎంతో ఆలస్యంగా విషయాలపై స్పందించడం చూస్తునాం. గత కొన్నేళ్లుగా రైతులు, కార్మికులు, ఆదివాసులు, నిర్వాసితులు వంటి వాళ్ళు చేసిన, అలాగే ఎన్ఆర్‌సి వ్యతిరేక ఆందోళనలో, ఇప్పుడు జంతర్ మంతర్ వేదికగా సాగిన విద్యార్థుల ఆందోళన లోనూ వుండాల్సిన చొరవ, క్రియాశీలత ఇలాంటి వాళ్ళల్లో అంతగా కనపడటం లేదు. ఇప్పటి ఈ తరానికి గత కాలపు నాస్టాల్జియాల బరువులు, ఫలానా పద్ధతిలోనే నిరసనలు తెలపాలి, ఫలానా నాయకులనే అనుసరించాలి అనే పట్టింపులు లేవు. జెండర్, బైనరీల హద్దులూ, పట్టింపులు కూడా వాళ్ళకి లేవు. అందరికీ అందుబాటులో మంచి నీళ్ళు ఉంచడం ఎంత అవసరమో, అలాగే రహస్యాలు ఏమీ లేకుండా అమ్మాయిల కోసం సానిటరీ నాప్కిన్స్ కూడా అంతే శ్రద్ధగా ఆందోళన జరిగే చోట అందుబాటులో ఉంచాలి అనుకుని, అమలు చేసిన జన్ జీ తరం వీళ్ళు. పగలు, రాత్రి, ఆ కిక్కిరిసిన జనసందోహం మధ్య వున్నా, అక్కడ అంతమంది మగపిల్లల మధ్య లైంగిక వేధింపులు ఏవీ తమకు ఎదురు కాలేదని, తాము బయట కన్నా నిరసన ప్రాంగణంలో ఎంతో సేఫ్‌గా ఉన్నామని అమ్మాయిలు స్పష్టంగా చెప్పారు. ఎంతో చురుకుగా ఆందోళనలో భాగస్వాములు అవడమే కాకుండా నాయకత్వం వహించారు. ఈ విద్యార్థులు తాము మాట్లాడే ప్రతి మాట అందరికీ అర్థం అయ్యేలా ఉండాలనుకోవడం, వాళ్ళ వేదన మనసుకి తాకేలా వుండటంవల్ల కూడా, ఆ మాటల్లో, వాళ్ళ డిమాండ్లలో న్యాయం వుందని మామూలు ప్రజలకి, చివరికి ఆందోళన చేస్తున్న ఆ పిల్లల తల్లిదండ్రులకు కూడా అనిపించింది. అందువల్ల కూడా వాళ్ళకి సంఘీభావంగా రకాల పద్ధతుల్లో అనేక మంది స్పందించారు. చాలా సదా సీదా మాటలతో, సూటిగా అనేక విషయాలపై విద్యార్థులు పౌరసమాజంతో సంభాషించడం మొదలుపెట్టారు ఇప్పుడు. పేదరికం, నిరుద్యోగం, హింస వంటి సవాలక్ష సమస్యల మధ్య మనం ఎటువంటి తీవ్రమైన ఒత్తిడుల మధ్య, ఊపిరాడినతనం, భయం మధ్య జీవిస్తున్నామో అలాంటి సంగతులు చాలా ఎక్కువే తెలుసు మనకి అనుకున్నా, 'ఇప్పుడు భయం తన హద్దులు అన్నిటిని అతిక్రమించింది, ఇక భయానికి భయపడటం మనం వదిలేద్దామా!' అని నేహాతో సహా వీధుల్లోకి వచ్చిన అనేక మంది పిల్లలు మళ్లీ మరొకసారి అందరికీ గుర్తు చేసారు. అవును ఇలానే, లేదా ఇంతకన్నా పెద్ద ఎత్తునే గత 12 ఏళ్లలో జనం వీధుల్లోకి వచ్చారు. రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, ముస్లిం సమాజం, దీర్ఘకాలం కొట్లాడారు. లాఠీఛార్జీలు చేసి, బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేసి, అక్రమ కేసులు పెట్టి జైళ్లలోకి నెట్టి ఎలాగోలా మొత్తం మీద అనేక గత ఉద్యమాలను అణచివేయడం జరిగింది. న్యాయమైన హక్కులకోసం ప్రశ్నించే వాళ్ళని అర్బన్ నక్సలైట్లు, టెర్రరిస్టులు, విచ్ఛిన్నకర శక్తులు, పాకిస్తానీ ఏజెంట్లు, తుక్డే.. తుక్డే గ్యాంగ్‌లు, దేశద్రోహులు, హిందూమత వ్యతిరేకులు.. ఇట్లా అంబుల పొదిలో నుండి ఎప్పటికప్పుడు అనేక బాణాలు తీస్తూ అన్ని ప్రసార మాధ్యమాలద్వారా విపరీతమైన దుష్ప్రచారం చేస్తూ, మామూలు ప్రజల ఆలోచనల్ని ప్రభావితం చేసే ప్రయత్నం అనేక ఏళ్లుగా పెద్ద ఎత్తున జరిగింది. ఇక వాట్సాప్ యూనివర్శిటీలు, సోషల్ మీడియాలు ఇలాంటి ప్రచారాల్ని, అసభ్యకర ట్రోలింగ్స్‌ని ఒక నిరంతర ఉద్యమంగా కొనసాగించాయి. ఇప్పుడు మతంపేరిట చూస్తున్న చీలికలను మేము అంగీకరించం అని ఈ పిల్లలు అంటున్నారు. ఈ జన్ జీ తరంపై కూడా దుర్మార్గమైన ప్రచారాలే దేశమంతటా జరుగుతున్నాయి. అమ్మాయిలకు చెప్పలేనంత అసభ్య దాడి కానీ ఈ తరం వీటిని అన్నింటినీ కూడా అత్యంత శక్తివంతంగా తిప్పికొడుతూ ఉంది. పరిపాలన చేసేవారు అత్యంత సీరియస్ మాట్లాడుతూ ఉన్నాం, అతి గొప్పగా తమ పాలసీలు ఉన్నాయి అనుకుంటూ, మన్ కీ బాత్ మాట్లాడుతున్నాం అనుకుంటూ ఉంటే, ఈ విద్యార్థులు వీటన్నింటినీ ఒక పెద్ద జోక్‌గా, మిత్‌గా మార్చేసారు. ఏమాత్రం జంకు, భయము లేని, ఎంతో సృజనాత్మకత ఉన్న ఈ జన్ జీ తరం అధికారంలో వున్న వాళ్ళు విసిరిన ప్రతి ఒక్క బాణాన్ని, తమ చేతుల్లోకి తీసుకొని వాటిని అపహాస్యం చేస్తూ, కొత్త నినాదాలను, మీమ్స్, కార్టూన్స్, పాటలను అప్పటికి అప్పుడు సృష్టిస్తూ, సోషల్ మీడియా ద్వారా తిప్పికొట్టింది. వాళ్ళ స్పాంటేనిటీ, అవధులు లేని సృజన, వ్యంగ్యం, ఎగతాళి, హాస్యాన్ని ఎంతో అబ్బురపడి చూసి, నవ్వుకున్న వాళ్ళు ఎందరో. సోషల్ మీడియాలో మిలియన్‌ల సంఖ్యలో జనం చూస్తుండటం, ప్రభావితులు అవుతూ వుండటంతో వాటిని ప్రభుత్వం నిషేధించింది. విద్యార్థులకు వ్యతిరేకంగా మాట్లాడిన వాళ్ళని ఎవరినీ ఈ కొత్తతరం పిల్లలు వదిలిపెట్టలేదు. ఒక కొత్త పోరాట రూపాన్ని ఎంతో సమర్థవంతంగా జన్ జీ మెయిన్ స్టీమ్ లోకి పట్టుకురాగలిగింది. ఈ రూపాలు ప్రపంచమంతటా కూడా గతంలో అధికారంలో ఉన్నా వాళ్ళకి వ్యతిరేకంగా పోరాడే వాళ్ళు ఉపయోగించినవే అయినా, మన సమాజంలో ఎక్కువగా సీరియస్‌నెస్‌కే ప్రాధాన్యత ఉండేది. లాఠీ చార్జీలు, వాటర్ క్యాన్లు, టియర్ గ్యాస్‌లు, బ్యారికేడ్లు, ముళ్ళకంచెలు వీటన్నిటినీ కూడా జన్ జీ వెక్కిరింతకే వాడుకున్నది. దెబ్బలు తింటూ, పరిగెత్తుతూ కూడా ఈ పిల్లలు 'అన్నింటికీ భయపడిపోయి నోరు మూసుకోకండి, రాజు గారికి నిజంగానే బట్టలు లేవు' అని ధైర్యంగా అరుస్తూ, నవ్వుతూ మనకి చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో, భయానికి భయపడవద్దు అని చెప్పడం అనేది చాలా పెద్ద విషయం. జంతర్ మంతర్‌లో విద్యార్థుల ఉద్యమం ఒక మంత్ర కవాటాన్ని మళ్లీ తెరిచింది. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, హైదరాబాద్ ఇట్లా అనేక నగరాల్లో విద్యార్థులు నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలతోపాటు తాము ఎదుర్కొంటున్న అనేక విషయాలపై ఆందోళనలో చేస్తూ ఉన్నారు. ఇప్పుడు పాఠశాలల్లో చదువుకునే జన్ ఆల్ఫా పిల్లలూ దేశవ్యాప్తంగా అనేక చోట్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళనలను మొదలుపెట్టారు. దేశంలో విద్యా రంగ పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. 90వేలకు పైగా ప్రభుత్వ బడులు మూతపడ్డాయి, తరగతి గదులు, సరిపడినంత మంది అధ్యాపకులు లేరు. చివరికి మరుగుదొడ్లు. మంచినీటి వసతి కూడా అనేక బడులలో లేదు. అందరికీ విద్య అనేది కనీసమైన హక్కు. తమ పిల్లలు చేస్తున్న ఈ డిమాండ్‌ను ఇప్పుడు తల్లిదండ్రులు కూడా పూర్తిగా సమర్థిస్తున్నారు. అంత దాకా ఎందుకు విద్యారంగంలో ఉన్న ఉపాధ్యాయులు కూడా పాఠశాల విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించబడాలనే కోరుకుంటున్నారు. అయితే, మన సమాజానికి, సమూహాలకు ఉన్న అతి పెద్ద జబ్బు ఏమిటంటే వ్యక్తి సెంట్రీక్, ఆరాధనలు, భక్తి. అటు రైట్, లెఫ్ట్ సమూహాలు, వ్యక్తులు ఇలాంటి ధోరణులనుండి చాలామటుకు బయటపడలేదు. మనం అనుకున్న పద్ధతుల్లో, మనం అనుకున్న విధంగానే, మన శంఖంలో పోసినట్లే ప్రతిదీ ఉండదన్న ఎరుక కూడా అవసరం ఇప్పుడు చాలా అవసరం.

# కాకరేపుతున్న సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు

## కొండా సురేఖపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత

## సిఎం సహా నేతలంతా చర్యలకు పట్టు



హైదరాబాద్,

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె సుస్మిత చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులి వ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సురేఖ పార్టీ నుంచి వెళ్లిపోవడం మంచిదని పలువురు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోక ముందే తప్పుకోవాలన్నారు, ముఖ్యమంత్రిపై తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బుధవారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. దిల్లీలో ఉన్నప్పుడే కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరికొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ బుధవారం మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినని గురువారం సమాచారం ఇచ్చారు. మూడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. సమ్మక్క–సారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. ఇదే సమయంలో మంత్రి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌పై గురువారం కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును పోలీసులు నమోదు చేశారు. గతంలో ఓ వివాదంలో ఇతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినపుడు కూడా కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ సమయంలో పార్టీలోని కొందరి జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, తాజా పరిణామాల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇలాంటి వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయాలనే అభిప్రాయం కూడా పార్టీలో కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయం అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆమె మాటలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. మంత్రి వివరణను పరిశీలించాక ఏం చేయాలో ఆలోచిస్తాం' అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీకి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎవరికి వారు పలానా స్థానం నుంచి పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. టికెట్లు ఇవ్వడంలో సీడబ్ల్యూసీ, అధిష్ఠానానిదే తుది నిర్ణయం. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వంపై ఎందుకు వ్యాఖ్యలు చేశారు? ఆయన ఆవేదన ఏమిటి? అనేది అర్థం చేసుకున్నాం. ఆ నియోజకవర్గంలోని కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏ పై భారాస అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పులను సరిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని వివరించారు.

# వరలక్ష్మీదేవిగా అభయమిచ్చిన కనకదుర్గమ్మ

## ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

## పలు ఆలయాల్లో శ్రావణ సందడి

విజయవాడ,

శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరలక్ష్మీ దేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దుర్గమ్మ ఆలయంతోపాటు రాష్ట్రంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే కొన్ని ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. శాకంబరీ దేవి అలంకరణలో కుంకుళ్లమ్మ అమ్మవారు.. భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు. భక్తులు.. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. భీమవరం మావుళ్లమ్మకు నాలుగు లక్షల గాజులతో అలంకరించారు.శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందుకోసం భక్తులు నాలుగు లక్షల గాజులను సమర్పించారు. నెల్లూరు జిల్లాలో శ్రావణ శుక్రవార పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని గాజులు, వజ్రకిరీటంతో ప్రత్యేకంగా అలంకరించారు. అటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విశాఖపట్నం: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపారు. శ్రీకనకమహాలక్ష్మి, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# పవన్, లోకేశ్‌ల వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు

అమరావతి,

వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని వరలక్ష్మీ స్వరూపంగా పూజిస్తామని అన్నారు. ఈ పవిత్ర శ్రావణ శుక్రవారం శ్రీ వరలక్ష్మీ అమ్మవారి కరుణాకటాక్షాలు అందరికీ అందాలని పవన్ ఆకాంక్షించారు. 'శ్రావణ మాసంలో నిర్వహించే పవిత్రమైన వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలకు, కుటుంబ సౌభాగ్యానికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక. శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని వరలక్ష్మీ స్వరూపంగా పూజిస్తూ, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థించే ఈ పవిత్ర పర్వదినం మన ఆధ్యాత్మిక వారసత్వంలోని గొప్ప విశిష్ఠతను ప్రతిబింబిస్తుంది. ఈ పవిత్ర శ్రావణ శుక్రవారం శ్రీ వరలక్ష్మీ అమ్మవారి కరుణాకటాక్షాలు అందరికీ అందాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, సమృద్ధి నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రజలందరికీ నా హృదయపూర్వక వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.మహిళలకు సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే పండుగ వరలక్ష్మీ వ్రతం అని మంత్రి లోకేశ్ అన్నారు. ఆ వరలక్ష్మీ దేవి కృపతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఏపీ ప్రజలకు మంత్రి లోకేశ్... ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమెరికా గగనతలంలో తప్పిన ముప్పు

## ఢీకొనేంతగా దగ్గరకు వెళ్లిన రెండు విమానాలు

## ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంతో ప్రయాణికులు సేఫ్

న్యూయార్క్,

ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అందులో ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుంచి బయల్దేరింది. రెండింటికి ఒకటే ÷÷–లట్ నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే నంబర్ ఇవ్వడం సాధారణమే. అయితే ఒకే కాల్ సైన్ ఉన్న విమానాలు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం మాత్రం అరుదుగా జరుగుతుంది. షెడ్యూలింగ్ పొరపాటు కారణంగా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ అసాధారణ పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. అరైవల్, డిపార్చర్‌లో ఉన్న విమానాలకు వెంటనే వేర్వేరు సూచనలు చేశారు. అరైవల్‌లో ఉన్న విమానాన్ని ఎక్కువ ఎత్తు తీసుకోమని, డిపార్చర్‌లో ఉన్న విమానాన్ని తక్కువ ఎత్తులో ప్రయాణించమని సూచించారు. ఆ సూచనకు తగ్గట్టుగానే పైలట్లు తమతమ మార్గాలను మార్చుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాను 25 ఏళ్లుగా ఈ విధులు నిర్వర్తిస్తున్నానని, ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని కంట్రోలర్ చెప్పారు. అయితే ఈ భద్రతాలోపంపై దర్యాప్తు జరుగుతున్నది.

# ప్రజా సమస్యలు పట్టని రేవంత్ సర్కార్

చౌటుప్పల్ ఆగస్టు 22 (న్యూస్ వార్)

పెండింగ్ లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ గురించి పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేస్తుందని బిఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్ అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు, 6 గ్యారెంటీల అమలు విషయాన్ని పూర్తిగా మర్చిపోయిందని అన్నారు. ప్రజా సంక్షేమంపై ఏ ఒక్క మంత్రికి, ఎమ్మెల్యేకి కూడా చిత్తశుద్ధి లేదని, వాళ్ళ దృష్టి అంతా కుర్చీల మీద, కమిషన్ల మీదనే ఉందిని. కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటల వల్ల తెలంగాణ రాష్ట్ర పరిపాలన పూర్తిగా స్తంభించిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు కుమ్ములాటలు ఆపి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే బిఆర్ఎస్వీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



న్యూస్ వార్
వార్తా పత్రిక

# జపాన్ బృందాన్ని కలిసిన మర్రిగూడ ఆవాస విద్యార్థులు






**మర్రిగూడ ఆగస్టు 22 ( న్యూస్ వార్ )**

ఫ్రెండ్స్ ఇంటర్నేషనల్ క్లబ్స్ ఆర్గనైజేషన్ మరియు యంగ్ మైండ్స్ ఇంటర్నేషనల్ రీజన్ వారు నిర్వహించిన జపాన్ ఇండియా ఎక్స్చేంజ్ ప్రోగ్రాం భాగ్యనగర్ నారాయణ గూడ హోటల్ తాజ్ మహల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో జపాన్ నుండి వచ్చిన సేవా బృందాన్ని మర్రిగూడ ఆవాస విద్యార్థులు కలిసి ఆవాసంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలు విద్యార్థుల యొక్క విద్యాభ్యాసం, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసం, బాలభారతం లాంటి కార్యక్రమాల గురించి వివరించడంతో పాటు, జపాన్ బృందానికి ప్రకృతి వ్యవసాయంపై జరిగింది. ఆవాసం విద్యార్థుల అద్భుతమైన ప్రతిభకు ముగ్ధులైన జపాన్ బృందం త్వరలోనే ఆవాసాన్ని సందర్శిస్తామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ భారతి ప్రాంత సభ్యులు ఉట్కూరు లింగశీ సినీ దర్శకులు రాజమౌళి ఆవాస ప్రముఖ గోలి కిరణ్ పాల్గొన్నారు.

# హెజిలో పరిశ్రమలో రియాక్టర్ పేలి ఇద్దరు దుర్మరణం పలువురికి గాయాలు

**– ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్**



**పోచంపల్లి ఆగస్టు 22 (న్యూస్ వార్ )**

దోతిగూడెం గ్రామంలోని హెజెలో పరిశ్రమలో గత రాత్రి రియాక్టర్ పేలి ప్రమాదం జరిగిన స్థలాన్ని అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రియాక్టర్లు పూర్తిగా మరమ్మతులు అయ్యే వరకు కంపెనీని సీజ్ చేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు భారీ మొత్తంలో ఎక్స్‌గ్రేషియా అందించాలని కంపెనీ యాజమాన్యానికి సూచించడంతో పాటు క్షతగాత్రులకు అవసరమైన మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. క్షతగాత్రులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య ఖర్చుల బాధ్యత కంపెనీ యాజమాన్యమే భరించాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ సమక్షంలో పరిశ్రమల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం**

పరిశ్రమల్లో ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలపై సమగ్రంగా చర్చించి, భద్రతా చర్యలపై నిర్ణయాలు తీసుకునేందుకు రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్ సమక్షంలో జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు తెలియజేశారు.

**బాలికలకు స్ఫూర్తినిచ్చేలా ఆదర్శ వ్యక్తితో ముఖాముఖి కార్యక్రమం**

**మర్రిగూడ, ఆగస్టు 22 (న్యూస్ వార్)**

మండలంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ పాఠశాల -- మర్రిగూడలో బాలికల కోసం ఆదర్శ వ్యక్తితో ముఖాముఖి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మర్రిగూడ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శిరీష హాజరై బాలికలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు విద్య, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, వ్యక్తిగత భద్రత, లక్ష్య సాధన తదితర అంశాలపై శిరీష అవగాహన కల్పించారు. బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని ఆమె సూచించారు. సమాజంలో మహిళలు వివిధ రంగాల్లో సాధిస్తున్న విజయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



పాఠశాల ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం విద్యార్థినులు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని, అనురాధ, సూర్య, విజయ, కోమలి, సాజిదతో పాటు పాఠశాల బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

# ఖబర్దార్ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

## గాలి మాటలు మాట్లాడితే సహించేది లేదు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్



**చండూరు ఆగస్టు 22 (న్యూస్ వార్ )**

గత నాలుగు రోజులుగా బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల మధ్య జరుగుతున్న అవినీతి ముడుపుల ఆరోపణలపై నిజనిర్ధారణ ప్రమాణానికి వేదికగా నిర్ణయించుకున్న హనుమాన్ దేవాలయానికి ఈరోజు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్ తన పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఆరోపణలో భాగమైన తోపుడుబండ్ల వ్యాపారస్తులతో కలిసి ఉదయమే దేవాలయానికి చేరుకున్నారు. కానీ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కానీ నాయకులు కానీ అక్కడికి ఎవరూ రాకపోవడంతో ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట మీద నిలబడే వ్యక్తి అయితే ధర్నాలో తాను ప్రమాణం చేస్తాను. అన్న మాటకు కట్టుబడి ఈరోజు ప్రమాణం చేయడానికి హనుమాన్ దేవాలయానికి వచ్చేవాడని అన్నారు. ఆరోజు తమకు బస్సు షెల్టర్ స్థలాన్ని మార్చడానికి బండ్ల వాళ్ళందరూ కలిసి 12 లక్షల రూపాయలు ముట్ట చెప్పారని ఆరోపిస్తూ, ముడుపులు తీసుకున్నారని ప్రమాణం చేస్తా తీసుకోలేదని మీరు చేస్తారా అన్న సవాల్ ను స్వీకరించి మరుసటి రోజే మేము ప్రెస్ మీట్ పెట్టి నాలుగు రోజుల సమయం ఇస్తూ స్థలము సమయము కూడా నిర్ణయించి ప్రమాణానికి సిద్ధమని తెలియజేశాం. అనుకున్నట్టుగానే ఈరోజు నేను,మా పాలకవర్గం తోపాటు మేము ఎవరికి ముడుపులు ఇవ్వలేదంటూ ప్రమాణం చేయడానికి పండ్ల బండ్ల వాళ్ళు, వైన్ షాప్ ల వాళ్లు అందరూ వచ్చారు. కానీ సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యేకానీ, లోకల్ గా ఉన్న బిఆర్ఎస్ నాయకులు కానీ ఎవరు దేవాలయానికి రాకుండా ముఖం చాటేయ్యటంతోటే వాళ్ళ ఆరోపణల్లో నిజమెంతో అర్థమవుతుందని అన్నారు. ప్రజలందరికీ తానేమిటో తన క్యారెక్టర్ ఏమిటో తెలుసని, అందుకే కూసుకుంట్ల చేసిన ఆరోపణలు పిచ్చోడి మాటలుగా భావించి నవ్వుతున్నారని అన్నారు. అనవసరంగా చెప్పుడు మాటలు విని తమపై అభండాలు వేసి ప్రజల్లో నవ్వుల పాలైన ప్రభాకర్ రెడ్డి రేపటి నుంచి ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళ్తాడని ప్రశ్నించారు. ఖబర్దార్ ప్రభాకర్ రెడ్డి. నిజానిజాలు తెలుసుకోకుండా గాలి మాటలతో మాపై నిందలు వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ, నిరాధార ఆరోపణ చేసిన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తమకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రమాదకర కాలుష్య పరిశ్రమలను తరలించాలి

**దోతీ గూడెం, అంతమ్మగూడెం, జిబ్లక్ పల్లి గ్రామల సర్పంచ్ లు, పాలకవర్గంతో సహా గ్రామస్తుల డిమాండ్**

**భూదాన్ పోచంపల్లి ఆగస్టు 22 (న్యూస్ వార్)**

దోతిగూడెం హెజిలో రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలి తీవ్ర ప్రమాదం ఏర్పడి ముగ్గురు కార్మికులు మృతి చెందడంతో పాటు 11 మంది తీవ్రక్షతగాత్రులవడంతో కంపెనీ ముందు ఉద్రిక్తత నెలకొంది దీనితో కంపెనీ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు బాధితులకు న్యాయం చేయాలంటూ క్షతగాత్రుల బంధువులు బంధువులు ఒకవైపు కాలుష్యానికి ప్రమాదాలకు కారణమవుతున్న రసాయన పరిశ్రమలను తమ ప్రాంతాల నుంచి తరలించాలంటూ దోతి గూడెం అంతమ గూడెం జబ్లక్పల్లి గ్రామస్తులు ఒకవైపు కంపెనీ ముందు ధర్నా చేపట్టారు. దీంతో ఆ పరిసరాలని ఉద్రిక్త వాతావరణంతో నిండిపోయాయి. ఒక దశలో ఆందోళనకారులు కంపెనీలోకి చుచ్చుకుపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. కంపెనీలో జరిగిన ప్రమాద స్థాయి చాలా తీవ్రమైందని ఆ తీవ్రతను యాజమాన్యం బయటికి పొక్కకుండా చూస్తుందని షిఫ్ట్ లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉందని ఆ వివరాలు ఏమి బయటకి రానీయకుండా కంపెనీ ప్రయత్నిస్తుందని గ్రామస్తులు ఆరోపించారు.

# సంస్థాన్ నారాయణపురం మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

**సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 22 (న్యూస్ వార్ )**

భారతీయ జనతా పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఈరోజు మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శక్తి కేంద్ర ప్రబారీలు, ప్రముఖులు, రాష్ట్ర,జిల్లా మరియు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ బలోపేతం,భవిష్యత్ కార్యాచరణపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. బీజేపీ అనుబంధ మోర్చాల మండల అధ్యక్షుల పేర్లను సత్వరమే నిర్ణయించి జిల్లా పార్టీకి పంపించాలని, అదేవిధంగా ఇటీవల పార్టీ బాధ్యతల నుంచి తొలగించబడిన ముగ్గురు నాయకులు పార్టీ నాయకత్వాన్ని, పార్టీని ఉద్దేశించి ప్రెస్‌మీట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసి, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన నేపథ్యంలో, జిల్లా అధ్యక్షులు శ్రీ నాగం వర్షిత్ రెడ్డి సూచనల మేరకు వారిపై తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మండల నాయకులందరూ తీర్మానించారు. ఈ తీర్మానాన్ని జిల్లా అధ్యక్షులకు పంపించాలని నిర్ణయించారు. ఈ



కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, ఓబీసీ మోర్చా కార్యదర్శి జక్కలి రాజు యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర నరసింహ గౌడ్, వంగరి రఘు, జిల్లా నాయకులు జక్కర్తి బిక్షం, ఆత్మారి రాములు, మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు వెంకటేష్, కార్యదర్శులు కోడూరు బీరప్ప, నర్రి నరసింహ, యువ మోర్చా మండల అధ్యక్షులు విస్కావుల గిరిబాబు గౌడ్, ఉపసర్పంచ్‌లు కట్కూరి భాస్కర్ గౌడ్, మెరుగు సైదులు, అలాగే కుకుడాల మహేందర్ రెడ్డి, నెల్లికంటి శ్రీశైలం, గూడెల్లి బాలరాజు, గజం భద్రయ్య, అంతటి సురేష్ గౌడ్, నెల్లికంటి నరసింహ తదితర నాయకులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టి.బి. పేషంట్లకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



**చౌటుప్పల్ ఆగస్టు 22 (న్యూస్ వార్)**

లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా అధ్యక్షతన. చౌటుప్పల్ డాక్టర్స్ అసోసియేషన్ మరియు బద్దం లింగారెడ్డి సౌజన్యంతో చౌటుప్పల్ లోని టి.బి.(క్షయ) వ్యాధితో బాధపడుతున్న పేషెంట్లకు పౌష్టిక ఆహార కిట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా డీఎంహెచ్ఓ ఎం. మనోహర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ టి.బి. వ్యాధితో బాధపడుతున్న వారు వైద్యుల సూచన, మందులను క్రమం తప్పకుండా తీసుకోవడంతోపాటు, శరీరానికి అవసరమైన పోషకాలను అందించి పౌష్టిక ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పేద మరియు ఆర్థికంగా వెనుకబడిన టిబి పేషెంట్లకు అండగా నిలిచి, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. విశిష్ట అతిథి మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రోగులకు సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాతలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే మరింత మందికి ఆరోగ్య సేవలు అందించవచ్చు అని తెలిపారు. దేశంలో పోలియోను ఏ విధంగా అయితే నివారించగలిగామో అదేవిధంగా టిబి వ్యాధిని కూడా నివారించేంతవరకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ వంశీ, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు, ట్రస్టు కార్యదర్శి మోగుదాల రమేష్ గౌడ్, కోశాధికారి గోశిక కరుణాకర్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఎండి అతః పాషా, చౌటుప్పల్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరావు, డాక్టర్ అవ్వారి శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ సుమన్ కళ్యాణ్, డాక్టర్ కాటంరాజు, దాచేపల్లి రాజు గుప్తా, బత్తిని రఘు గౌడ్, బద్దం లింగారెడ్డి, కాసుల వెంకటేశం, వేముల నరసింహ, కొసనం రాంరెడ్డి, కటకం ప్రశాంత్, నాంపల్లి రమేష్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

# పిల్లాయిపల్లి పిల్ల కాలువ సర్వేలో భాగంగా రైతుల భూముల్లో మార్కింగ్

**చౌటుప్పల్ ఆగస్టు 22 (న్యూస్ వార్)**

పిల్లాయిపల్లి పిల్ల కాలువ ద్వారా పెద్దకొండూరు చెరువుకు సాగునీరు అందించే లక్ష్యంతో కాలువ సర్వే పనులు చేపట్టారు. జిబ్లక్‌పల్లి నుంచి పెద్దకొండూరు చెరువు వరకు కాలువ మార్గాన్ని సర్వే చేయడంలో భాగంగా రెండో రోజు మసీదుగూడెం నుంచి జిబ్లక్‌పల్లి వరకు కాలువ సర్వేను పూర్తి చేశారు. సర్వేలో రైతుల భూముల్లో కాలువకు సంబంధించిన ప్రాంతాలను గుర్తించి మార్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు. కాలువ నిర్మాణానికి సహకరిస్తూ భూములను అందించేందుకు ముందుకు వస్తున్న రైతులకు పెద్దకొండూరు మాజీ సర్పంచ్ కాయితి రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సహకారంతో కాలువ పనులు త్వరితగతిన పూర్తయి, పెద్దకొండూరు చెరువుకు సాగునీరు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,